సాక్షి
EPAPER

# సేవలకు గుర్తింపు



అవార్డులు అందుకుంటున్న శ్రీనివాస్ పినిశెట్టి, వి. ఆర్. పెద్దిరెడ్డి

**భువనేశ్వర్:** స్థానిక భారతీయ సాంకేతిక సంస్థ(ఐఐటీ)అధ్యాపకులు, సిబ్బంది సేవలకు గుర్తింపు లభించింది. ఈ సందర్భంగా వారికి ఆ సంస్థ నైపుణ్యతా అవార్డులను శుక్రవారం ప్రదానం చేసి, గౌరవించింది. ప్రధానంగా ఆ సంస్థ 13వ వార్షికోత్సవం పురస్కరించుకుని, ఆ సంస్థ డైరెక్టరు ఆర్.వి.రాజకుమార్ ఈ అవార్డులను శుక్రవారం అందజేశారు. అధ్యాపక వర్గానికి బోధన నైపుణ్యత, అత్యున్నత పరిశోధన–2020 అవార్డులను ప్రదానం చేయగా, సిబ్బందికి అత్యున్నత సేవల పురస్కారం అందజేయడం విశేషం. మొత్తం 17 మందికి వ్యవస్థాపక నైపుణ్యతా అవార్డులను ఇవ్వగా, సమగ్ర నైపుణ్య అవార్డుని స్కూల్ ఆఫ్ ఎలక్ట్రికల్ సైన్సెస్ అధ్యాపకుడు శ్రీనివాస్ పినిశెట్టి సాధించడం విశేషం

# ఉత్పాదనలో సాంకేతిక పరిజ్ఞానమే కీలకం

- డీఆర్‌డీఓ చైర్మన్ డాక్టర్ జి.సతీష్‌రెడ్డి
- స్థానిక ఐఐటీలో ఘనంగా వ్యవస్థాపక దినోత్సవం



మాట్లాడుతున్న డాక్టర్ జి.సతీష్ రెడ్డి

**భువనేశ్వర్:** స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో దేశంలో ఉత్పాదన వ్యవస్థ అభివృద్ధి చెందాలని, సామాన్యునికి సరసమైన ధరకు ఉత్పాదనలు అందుబాటులోకి రావాలని రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ(డీఆర్‌డీఓ) అధ్యక్షుడు డాక్టర్ జి.సతీష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జరిగిన ఐఐటీ భువనేశ్వర్ వ్యవస్థాపక దినోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా(వర్చువల్‌గా) పాల్గొన్నారు. నాణ్యమైన ఉత్పాదనలు తక్కువ ధరలో విరివిగా లభించేలా ఉత్పాదన కొనసాగాలని ఆకాంక్షించారు. రక్షణ సాంకేతిక పరిజ్ఞానం కలిగిన అత్యాధునిక సరంజామాతో దేశం పటిష్టంగా తయారైందని, ఈ రంగంలో భవిష్యత్ తరాలను ప్రోత్సహించేందుకు సాంకేతిక అభివృద్ధి నిధిని భారత ప్రభుత్వం ప్రవేశ పెట్టిందన్నారు. ఈ నిధి కింద ఔత్సాహిక సాంకేతిక పరిజ్ఞాన ఉత్పాదన సంస్థల ఏర్పాటు, నిర్వహణకు ఒక్కో ప్రాజెక్టుకు గరిష్టంగా రూ. 10 కోట్ల వరకు ఆర్థిక సహాయం లభిస్తుందన్నారు. సృజనాత్మక పరిశోధనలు ప్రోత్సహించేందుకు ప్రత్యేక నిధి ఏర్పాటు అవుతుందన్నారు. దేశవ్యాప్తంగా పేరొందిన సంస్థలకు చెందిన 500 పైబడి మేధావంతులైన విద్యార్థులు డీఆర్‌డీఓ ప్రయోగ శాలల్లో పరిశోధనలు కొనసాగిస్తున్నారని, ఏపీజే అబ్దుల్ కలాం కలల సాకారం కోసం సాంకేతిక పరిజ్ఞానంతో దేశం ప్రపంచ స్థాయిలో అగ్రస్థానాన్ని చేరాల్సి ఉందన్నారు. కలాం కలను సాకారం చేసేలా విద్యార్థులను బహుముఖ నిపుణులుగా తీర్చిదిద్దేందుకు డీఆర్‌డీఓ నడుం బిగించిందని పేర్కొన్నారు. స్థానిక ఐఐటీ వంటి సంస్థలతో డీఆర్‌డీఓ సంయుక్తంగా దీర్ఘకాలిక పరిశోధన కార్యకలాపాల్ని చేపడుతుందని, ఈ రంగంలో రూ. 1,000 కోట్ల వ్యయంతో పలు ప్రాజెక్టుల్ని డీఆర్‌డీఓ నిర్వహిస్తుందని సతీష్ రెడ్డి తెలిపారు.

ప్రపంచ శ్రేణి సాంకేతిక విద్యా సంస్థగా తీర్చిదిద్దడం నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ ఆర్వీ రాజకుమార్ తెలిపారు. వాతావరణ మార్పులు, ఆకస్మిక ప్రమాదాలు, ప్రకృతి విపత్తు వగైరా పరిస్థితుల్ని అవలీలగా అధిగమించే రీతిలో అధునాతన పరిశోధనలకు ఈ సంస్థ ప్రధాన వేదికగా నవ తరానికి ఆహ్వానం పలుకుతుందన్నారు. విభిన్నమైన నైపుణ్య కేంద్రం (యూనిక్ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్) ఏర్పాటు దిశలో స్థానిక ఐఐటీ అడుగులు వేస్తుందని, జల వనరుల సద్వినియోగం, ప్రత్యామ్నాయ విద్యుత్ వనరుల ఆవిష్కరణ వంటి పలు సృజనాత్మక పరిశోధనలకు ఈ సంస్థ అత్యాధునిక సాంకేతిక విద్యా వ్యవస్థని తరచు సంస్కరించడం ప్రత్యేకతగా పేర్కొన్నారు.

బోధన, అభ్యాసం, సాధన రంగాల్లో భారీ సంస్కరణలు చోటు చేసుకోవాలని, ప్రస్తుత వ్యవస్థలో పలు లొసుగుల్ని అధిగమించేందుకు నవ తరం అధ్యాపకుల నిరంతర కృషి అవసరమని ప్రొఫెసర్ రాజశేఖర్ తెలిపారు. కరోనా విపత్కర పరిస్థితుల్లో విద్యా సంవత్సరం ఏమాత్రం వృథా కాకుండా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సెమిస్టర్లను యథాతథంగా నిర్వహించిన ఏకైక సంస్థగా ఈ సంస్థకు పేరు రావడం గర్వ కారణమన్నారు. కరోనా సంక్రమణ భయంతో రాజీ పడకుండా తరగతులు, పరీక్షల్ని యథాప్రకారం నిర్వహించడం విశేషం. హైబ్రీడ్ మాధ్యమంలో వ్యవస్థాపక దినోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించారు.